డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

● బీఆర్ఎస్ నాయకుడు పూసగోరక్‌నాథ్

ముషీరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలో నిత్యం డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ అన్నారు. పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గంగపుత్ర కాలనీలో వారం రోజులుగా పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను మంగళవారం జలమండలి డ్రైనేజీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ పర్యవేక్షణలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేయించారు.


గంగపుత్ర కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేస్తున్న జలమండలి సిబ్బంది

సీసీఐ జాతీయ సమావేశాలు ప్రారంభం

చిక్కడపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన క్రమంలో కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో నిర్వహిస్తున్న జాతీయ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, క్యాట్కో చైర్మన్ శంకర్‌లాల్ చౌరాసియా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రవణ్‌కుమార్, రాష్ట్ర ప్రతినిధులు వీరస్వామి, అనిల్‌కుమార్, నందు, ప్రవీణ్‌లు హాజరయ్యారు.

పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్యాంప్ ముగింపు

చిక్కడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వివేకానంద కేంద్ర కన్యాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్యాంప్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విజేతలైన చిన్నారులకు సర్టిఫికెట్లు, అవార్డులు, ఉచితంగా నోట్ బుక్కులు, పెన్నులు అందజేశారు. భగవద్గీత పద్యాలు యోగా ఇతరత్రా సంగీత కార్యక్రమాలు జరిగాయి. సీనియర్ న్యాయవాది వెంకట సుబ్బయ్య, సీనియర్ ప్రొఫెసర్ డా. వెంకటేశ్వరరావు, రామరాజు, సినీ గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, అంతర్జాతీయ వైశ్యసమాఖ్య తెలంగాణ ఉపాధ్యక్షుడు నీలా శ్రీధర్ పాల్గొన్నారు.



ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సదుపాయాలను పరిశీలిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పర్యవేక్షకురాలు రజిని

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

ముషీరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పర్యవేక్షకురాలు, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రజిని తెలిపారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను రజిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేస్తేనే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, స్కూల్ సెక్రటరీ రతన్, పీఈటీ కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పద్యాల పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలు, యువతీయువకులు, ఔత్సాహికుల్లో పౌరాణిక నాటక రంగస్థల పద్యాలపట్ల ఆసక్తి పెంచి వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు చిమ్మపూడి ఫౌండేషన్ సంకల్పించిందని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చిమ్మపూడి శ్రీరామమూర్తి తెలిపారు. ఇందులో భాగంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. భావ, రాయ యుక్తంగా ఏవైనా 2 పద్యాలు(సోలో) అభ్యర్థులు పాడాల్సి ఉంటుందని తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు జూనియర్స్‌గా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు సీనియర్స్‌గా పోటీలో పాల్గొనాలని వివరించారు. రెండు విభాగాలలోను ప్రథమ, ద్వితీయ శ్రేణి వారికి నగదు బహుమతి, జ్ఞాపిక, పుస్తకాలు ప్రదానం ఉంటుందని జూలై చివరివారంలో పోటీ జరుగుతుందని తెలిపారు. జూలై 2వ తేదీలోగా అభ్యర్థులు 9704177270 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపికైన అభ్యర్థులే పోటీకి అర్హులన్నారు.

కేంద్ర మంత్రుల నగర పర్యటన వాయిదా

బర్కత్‌పుర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల నగర పర్యటన ఈ నెల 20కి వాయిదా పడింది. ఈ నెల 19న నగరానికి రానున్న కేంద్ర మంత్రులు బుధవారం కేంద్ర క్యాబినెట్ తొలి సమావేశం జరుగుతుండడంతో వాయిదా పడిందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, రాష్ట్ర నాయకుడు ఎక్కాల నందు తెలిపారు.



ప్రమాదం జరిగిన చోట గుమిగూడిన ప్రజలు

టీ కొట్టులోకి దూసుకెళ్లిన స్కూల్ వ్యాన్

● తప్పిన పెనుప్రమాదం

బర్కత్‌పుర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ డ్రైవర్ మితిమీరిన వేగంతో స్కూల్ మినీ వ్యాన్‌ను నడపడడంతో అదుపు తప్పి మెకానిక్ షాపు, టీ కొట్టులోకి దూసుకెళ్లిన సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పల్‌లో నివాసం ఉంటున్న జానయ్య(45) మినీ స్కూల్ వ్యాన్‌ను కొత్తగా కొనుగోలు చేశాడు. వ్యాన్‌కు నంబర్ ప్లేట్ కూడా రాలేదు. పిల్లలను పాఠశాలకు ఈ వ్యాన్‌లో తీసుకెళ్తున్నాడు. మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో పిల్లలను స్కూల్ వద్ద దింపిన తర్వాత తిలక్‌నగర్ మెయిన్ రోడ్‌లో వేగంగా వ్యాన్ నడుపుకుంటూ వెళ్తున్నాడు. తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో మహేష్ పాన్‌షాపు పక్కన ఈ మినీ స్కూల్ వ్యాన్ అదుపుతప్పి మెకానిక్ షాపు, దాని పక్కనే ఉన్న టీ కొట్టులోకి దూసుకుపోయింది. అక్కడ ఉన్న వారు పక్కకు తప్పుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. మెకానిక్ షాపులో పనిముట్లు, టీ కొట్టు రేకులు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. రాజు అనే వ్యక్తి కాచిగూడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మారుతీ మినీ వ్యాన్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్ జానయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత తిలక్‌నగర్ మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోయింది. డ్రైవర్ మితిమీరిన వేగం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ కారు డ్రైవర్ భార్యతో గొడవపడి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... సరూర్‌నగర్‌లో నివాసం ఉంటున్న రాజవర్ధన్‌రెడ్డి(35) కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆక్సిడెంట్ జరగడంతో కాళ్లు విరిగి ఏమి పనిచేయకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో భార్యతో గొడవపడి ఈ నెల 15న మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై కూర్చుని విషం తాగి పడిపోయాడు. ప్రయాణికులు అందించిన సమాచారంతో పోలీసులు రాజవర్ధన్‌రెడ్డిని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

నీట్-2024 ప్రవేశ పరీక్షలో జరిగిన అక్రమాలపై

సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి



ఆర్ట్స్ కళాశాల నుంచి నీట్ పరీక్ష లీక్‌ను వ్యతిరేకిస్తూ నిర్వహించిన నిరసనలో విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు


ఇందిరాపార్కు నుంచి ర్యాలీగా తరలివెళ్తున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు విశాల్‌కుమార్, విద్యార్థులు

● విద్యార్థి సంఘాల జేఏసీ నేతల డిమాండ్

రాంనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నీట్-2024 ప్రవేశ పరీక్షలో జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని, నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని, నీట్ ఏజెన్సీని రద్దు చేయాలని పీడీఎస్‌యూ, ఏఐడీఎస్‌వో, యూఎస్ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల నుంచి ఉస్మానియా ఉమెన్స్ హాస్టల్ వరకు దాదాపు 200 మంది నల్ల గుడ్డతో ర్యాలీ నిర్వహించి ఎన్‌టీఏ దిష్టబొమ్మను దహనం చేశారు. విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు వెంకటరెడ్డి, మల్లేష్, తిరుపతి, రంజిత్, రాజేష్, నిఖిత్, అభిషేక్, నాగరాజు, మహేష్, సూర్య, హరీష్, రాకేష్, శ్రీనాథ్, మమత, మౌనిక, స్వప్న తదితరులు మాట్లాడారు. నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ అయిందని వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం, ఏటీఏ విచారణ చేపట్టకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తుందని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించకుంటే ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలి

కవాడిగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరిగిన నీట్-2024 పరీక్షను రద్దుచేసి సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు విశాల్ కుమార్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇచ్చిన చలోరాజ్ భవన్ పిలుపు మేరకు బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు విశాల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ నుంచి వందలాది మందివిద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు.

ఇతర రాష్ట్ర ప్రభుత్వాల మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకొని నీట్ పరీక్షలు రాసిన విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నేతలు నితీష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో షట్టర్ వేలం నిలిపివేయాలి

● అభివృద్ధి కమిటీ సభ్యుల ఆందోళన
● ఈవోకు వినతిపత్రం అందజేత

కవాడిగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ దోమలగూడ హనుమాన్ ఆలయంలో ఖాళీ షట్టర్ (మడిగ)ను అద్దెకు ఇవ్వవద్దని డిమాండ్ చేస్తూ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం దేవాలయం ఎదుట దాదాపు యాభై మంది భక్తులు ఆందోళన చేశారు. అనంతరం దేవాలయ ఈవో దేవానాథంకు వినతి పత్రం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కెఆర్‌కె ప్రసాద్, సలంద్రి శీనివాస్‌యాదవ్, లక్ష్మీనారాయణ, వి.డి కృష్ణ, బి. శ్యామ్‌లాల్, జె పరమేశ్వర్‌లు మాట్లాడుతూ దేవాలయంలో ఉన్న మడిగను అద్దెకు ఇవ్వకుండా దానిని పూర్తిగా తొలగించి భక్తుల సౌకర్యార్థం గుడిని విశాలంగా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల 24న దేవాలయంలో ఖాళీగా ఉన్న మడిగను అద్దెకు ఇస్తామని ఇచ్చే నోటీసులను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సురేష్‌కుమార్, వెంకటేష్, దిలీప్‌యాదవ్, జంగాశ్రీనివాస్, కుమార్ గౌడ్, వెంకటరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు పాల్గొన్నారు.


హనుమాన్ ఆలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కెఆర్‌కె ప్రసాద్, శ్రీనివాస్ యాదవ్, భక్తులు


బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలను వినిపిస్తున్న నూతి మాధవ

ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంకు నివాళి

కవాడిగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భారత కళా సంఘం ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా నిర్వహించిన గీతాంజలి కార్యక్రమం సభికులను ఆకట్టుకుంది. నూతి మాధవ ఆధ్వర్యంలో జపాన్ రాజధాని టోక్యోలో భారతీయులు అధికంగా నివసిస్తున్న నిసికసాయి ప్రాంతంలో గీతాంజలి కార్యక్రమం నిర్వహించారు. 20 మంది గాయనీ గాయకులు తెలుగు, తమిళం, కన్నడం, మళయాలం, హిందీ భాషల్లో ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలను తిరిగి గానం చేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. వివిధ భాషల వారు ఒకే చోట చేరి పాటలతో గత స్మృతుల జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని పరవశించారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

బౌద్ధనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో చిలకలగూడలో అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ ఎం.సురేందర్ జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. మంగళవారం రోడ్లు అధ్వానంగా ఉన్నాయని సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదుచేశారు. గుంతలు పడిన రోడ్లపై మురికినీరు పారుతుందని, దీంతో వాహనదారులు, పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొందని, దీంతో పాటు దోమలు వ్యాప్తిచెంది, దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అధ్వానంగా ఉన్న రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.


చిలకలగూడలో అధ్వాన స్థితిలో ఉన్నరోడ్డు

చిన్నారుల కొనుగోలు కేసు దర్యాప్తు ముమ్మరం

మరో ముగ్గురిని రక్షించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సంచలనం సృష్టించిన చిన్నారుల కొనుగోలు కేసులో రాచకొండ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మరో ముగ్గురు చిన్నారులను రక్షించినట్లు సీపీ తరుణ్ జోషి మంగళవారం తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా అయి విక్రయించబడిన 15 మంది చిన్నారులను ఇటీవల రాచకొండ పోలీసులు రక్షించి, నిందితులను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు రక్షించిన చిన్నారుల సంఖ్య 18కి చేరిందన్నారు. చిన్నారులను అక్రమ రవాణా చేయడంలో పూణె, ఢిల్లీ ముఠాల హస్తం ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో పూణె పోలీసులు 9 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిసింది. వీరికి నగరంలో దొరికిన ముఠాలతో లింకులపై పోలీసులు ఆరా తీయగా.. ఐదుగురు నిందితులకు సంబంధం ఉన్నట్లు తేలింది. వారిని పీటీ వారెంట్‌పై నగరానికి తీసుకొచ్చి విచారించి ఢిల్లీ ముఠాలతో ఉన్న లింకులపై సమాచారం రాబడతామని సీపీ తెలిపారు. ముఠాల గుట్టు వీడితే ఆ చిన్నారులను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? వారి తల్లిదండ్రులు ఎవరు అనేది తెలుస్తుందన్నారు.


చిన్నారిని చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు అప్పగిస్తున్న సీపీ తరుణ్ జోషి

హాస్టల్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ

యూసుఫ్‌గూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో రెండు ల్యాప్‌టాప్‌లు చోరీ అయ్యాయి. బి. హరలాల్ నాయక్ బేగంపేటలో ఓ సంస్థలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ వెంగళరావునగర్‌లోగల హ్యాపీబాయ్స్ హాస్టల్‌లో 104 రూమ్‌లో ఉంటున్నాడు. హైటెక్ సిటీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పి.వంశీకృష్ణ కూడా అదే రూమ్‌లో ఉంటున్నాడు. ఈనెల 17వ తేదీ ఉదయం ఇద్దరి ల్యాప్‌టాప్‌లు కనిపించలేదు. విషయం హాస్టల్ నిర్వాహకులకు చెప్పగా.. సీసీ కెమెరాలను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి ఉదయం 6.40 గంటలకు హాస్టల్‌లో వారి రూమ్‌లోకి వెళ్లి ల్యాప్‌టాప్‌లో తీసుకొని వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

జీడిమెట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ ఆటోడ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చింతల్ పద్మానగర్ ఫేజ్-2కు చెందిన ఎరుకల లక్ష్మణ్(26) ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం పక్కన ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య

నిజాంపేట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అద్దె కట్టలేదని ఇంటి యజమాని తల్లి తిట్టడంతోనే తనభర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి ప్రాంతంలోని గోకవరానికి చెందిన దాసరి వరప్రసాద్(45), భార్య శైలజ బాచుపల్లి ప్రాంతంలోని శ్రీసాయినగర్, వసంతనగర్ కాలనీలో నివాసముంటున్నారు. ఈనెల 15వ తేదీన శైలజ పోచారంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది.

ఆర్థిక ఇబ్బందులతో 4 నెలల నుంచి ఇంటి అద్దె కట్టలేదని ఇంటి యజమాని తల్లి కఠినంగా మాట్లడటంతో మనస్తాపానికి గురైన వరప్రసాద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

బైక్ రేసర్ల అరెస్టు.. 10 బైక్‌లు స్వాధీనం

రాయదుర్గం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నాలెడ్జ్‌సిటీలో రోడ్లపై బైక్‌రేస్‌లు నిర్వహిస్తున్న వారిపై రాయదుర్గం పోలీసులు రైడ్ చేసి పదిమందిపై కేసులు నమోదు చేశారు. ఆదివారం రాత్రి రాయదుర్గం నాలెడ్జ్‌సిటీ ప్రాంతంలోని టీహబ్, సత్వ ప్రాంతాల్లోని రహదారులపై బైక్‌రేసింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది రైడ్‌చేసి పది మంది రేసర్లను గుర్తించారు. మరో పదిమంది తప్పించుకుని పారిపోయారు. పది మంది గుర్తించి వారిలో నలుగురు పారిపోగా ఆరుగురిని మంగళవారం అదుపులోకి తీసుకుని పది బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారిని న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకన్న మాట్లాడుతూ.. కొద్దివారాలుగా బైక్‌రేసర్లు శని, ఆదివారాల్లో బైక్ రైస్‌లు నిర్వహిస్తూ రోడ్డుపై వెళ్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం అందడంతో రాత్రి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రి సమయంలో బైక్‌రేస్‌లు, విన్యాసాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. అయినప్పటికీ వారు రేసింగ్‌లు నిర్వహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బైక్‌రేసర్లపై బైఓవర్ కేసులు నమోదు చేస్తున్నామని హెచ్చరించారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

గురువులను గౌరవించడం గొప్ప సంస్కారం

చిక్కడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గురుపరంపరకు భారతీయ సంస్కృతిలో ప్రాధాన్యం ఉందని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. కళను నేర్చుకున్న శిష్యులు వారి గురువులను గౌరవించడం, గురువులు వారి గురువులను గుర్తుచేసుకోవడం గొప్ప సంస్కారమని ఆమె పేర్కొన్నారు. భారత చూడామణి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యగురువు నెమలికంటి సువర్ణలత తన గురువులు పద్మశ్రీ అడయార్ కె. లక్ష్మణ్, వేదాంతం జగన్నాధశర్మల సంస్మరణ సభ త్యాగరాయగానసభలో నిర్వహించారు. ఆమె శిష్య బృందం కూచిపూడి నాట్యప్రదర్శనను అద్భుతంగా చేశారు. ముఖ్య అతిథిగా వాణీదేవి మాట్లాడుతూ సువర్ణలత ఐదు దశాబ్దాలుగా కూచిపూడి నాట్యంలో వందలమందికి శిక్షణనిచ్చి మంచి కళాకారులుగా తీర్చిదిద్దారని అభినందించారు. కర్ణాటక సంగీత నాట్య అకాడమీ పూర్వ చైర్మన్ వైజయంతి కాశీ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఏకాగ్రతకు నాట్యం సాధనం అన్నారు. ఆధ్యాత్మికవేత్త డా. అనంతలక్ష్మి, నర్తకి మణులను అభినందించారు.

ఆలయంలో అడ్వకేట్ జనరల్ పూజలు

చిక్కడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించిన ఆయనకు ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు స్వాగతం పలికారు.

ఆలయంలో అన్నదానానికి సహకరించండి

చిక్కడపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో భక్తులకు నిర్వహించే అన్నదానానికి దాతలు సహకరించాలని ఆలయ ఈవో దేవనాథం కోరారు. ప్రతి మంగళవారం, శనివారాల్లో దేవాలయాన్ని సందర్శించే భక్తులకు మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం చేయడానికి సంకల్పించినట్లు తెలిపారు. ఆసక్తిగల భక్తులు 9912939205, 9000983042 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.


రెజీనా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, తదితరులు

రెజీనా సేవలు చిరస్మరణీయం

● బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ

రాంనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవా కార్యక్రమాల నిర్వహణలో రెజీనా చేసిన సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ అన్నారు. రాంనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ కాలనీలో కోట సునీల్ ఆలియాస్ (పెద్ద బబ్లు) ఆధ్వర్యంలో రెజీనా సంతాప సభ మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ముఠా జైసింహ హాజరై రెజీనా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేశవపురం అరుణ్, అరవింద్, సునీల్, ఎడ్విన్, అనిల్, సామ్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిసి పూలబొకే అందజేసిన టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, తదితరులు

హరీశ్‌రావును కలిసిన వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించి ఎన్నో నిర్బంధాలను ఎదురించి తెలంగాణ ఏర్పాటులో వంగపల్లి శ్రీనివాస్ క్రియాశీలక పాత్ర పోషించారని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ కలిసి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి హక్కుల ఉద్యమ నాయకుడిగా వంగపల్లికి తాను అండగా ఉంటానని పేర్కొంటూ శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పి.రమేష్, నాయకులు యాతాకుల భాస్కర్, బంగారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఊడిన ఆటో వీల్... తప్పిన ప్రమాదం

రెజిమెంటల్‌బజార్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆటోలకు సరైన పత్రాలు, ఫిట్‌నెస్ లేకుండానే లోకల్‌గా తిప్పడం పరిపాటిగా మారింది. మంగళవారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటో వీల్ ఊడిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సికింద్రాబాద్ సంగీత్ జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ వైపు వేగంగా వస్తున్న ఆటో మదర్‌థెరిసా విగ్రహం వద్ద రాగానే ఆటో వెనుక చక్రం ఊడిపోయింది. ఆ సమయంలో వెనుక వాహనాలు లేకపోవడంతో ప్రమా దం తప్పింది. ఈ సమయంలో ఆటోలో ఉన్న నలుగురు ప్రయాణికులు ఆందోళన పడ్డారు. ఆర్టీఏ అధికారులు ఆటోల ఫిట్‌నెస్‌పై దృష్టిసారించాలని ఈ సంఘటన గుర్తుచేస్తుంది. ట్రాఫిక్ పోలీసులు ఆటో అడ్డాల వద్ద షేరింగ్ ఆటోలపై దృష్టిసారించి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు, లైసెన్స్, ఫిట్‌నెస్ పత్రాలను తనిఖీలు చేస్తే ప్రమాదాలు నివారించే అవకాశం ఉంది.


వీల్ ఊడిపోయి రోడ్డు మీద నిలిచిన ఆటో

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో అపస్మారక స్థితిలో పడిఉన్న ఓ వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబరు 9లో మంగళారం ఉదయం ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సదరు వ్యక్తిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోనాల నిధుల కోసం దరఖాస్తు చేసుకోండి

చిలకలగూడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం బోనాల పండుగను పురస్కరించుకుని అమ్మవారి దేవాలయాలకు అందజేస్తున్న నిధుల కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. రాష్ట్రప్రభుత్వం అమ్మవారి ఆలయాల అలంకరణ అభివృద్ధి కోసం ప్రతి సంవత్సరం మాదిరిగానే నిధులు కేటాయిస్తుందని, గత సంవత్సరం నిధులు పొందిన ఆలయాల నిర్వాహకులు మాత్రమే అర్హులని, ఆలయం ఫోటో, లెటర్ హెడ్, అధ్యక్షుడు, కార్యదర్శి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, నిధుల వినియోగం యూటిలైజేషన్ సర్టిఫికెట్, రెండు రెవెన్యూ స్టాంపులు, గత సంవత్సరం పొందిన చెక్కు జిరాక్స్ కాపీ జతచేయాలని తెలిపారు. మెట్టుగూడ కార్పొరేటర్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని తెలిపారు.